సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 18 । జూన్ । 2024



'పెన్నమ్మ' గలగలలు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెన్నానదిలో నీరు పరవళ్లు తొక్కుతోంది. పిల్లలు, పెద్దలు చెన్నూరు, సిద్దవటం ప్రాంతాలకు వెళ్లి పెన్నమ్మ ప్రవాహాన్ని తిలకిస్తున్నారు. -8లో



మొక్కు తీర్చుకుని వస్తుండగా...

పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గుర్రప్ప స్వామి వద్ద మొక్కు తీర్చుకుని వస్తుండగా రోడ్డుప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. -8లో

గరిష్టం/కనిష్టం
37.2/27.2

వాతావరణం

జిల్లాలో సోమవారం 27.2 - 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు జహీరియా బర్సీ మహోత్సవం



హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రీ (ఫైల్)

కమలాపురం: కమలాపురం పెద్ద దర్గాగా వెలుగొందుతున్న దర్గా-ఏ-గఫారియా దివంగత పీఠాధిపతి హాజీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవాన్ని మంగళవారం పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం పీఠాధిపతి ఇంటి నుంచి భక్తులతో ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు. జహీరియా దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం నాత్, పీఠాధిపతి బయాన్ చేస్తారని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

వితరణ

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలోని వీరభద్ర స్వామి అన్న సత్రానికి సోమవారం రూ.15,431లు భక్తులు నుంచి ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ప్రతి సోమవారం వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామని ఈఓ తెలియజేశారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కడప అర్బన్: సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి తెలిపారు. జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న కక్షిదారులు పూర్తి వివరాల కోసం కడపలోని న్యాయసేవా సదన్‌ను సంప్రదించాలని వారు కోరారు.

టమాట @ 80



మదనపల్లె సిటీ: టమాట ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో సోమవారం మొదటి రకం కిలో రూ. 80, రెండో రకం కిలో రూ.68 పలికింది. 396 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. పంట దిగుబడులు తగ్గడం.. అందుకు తగ్గ డిమాండ్ ఉండటంతో ధరలు క్రమేపి పెరుగుతున్నాయి. అలాగే ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట దిగుబడి తగ్గిపోయింది. మార్కెట్ నుంచి తమిళనాడు, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ధరలు పెరుగుతుండటంతో రైతులు టమట పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

నూతన నియామకం

మదనపల్లె: ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడిగా మదనపల్లెకు చెందిన డాక్టర్.కరుణాకర్ ఆరమడక నియమితులయ్యారు. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు జేఎస్.రాజేంద్ర, కేంద్ర కార్యదర్శి వాసవిలు సోమవారం డాక్టర్.కరుణాకర్ ఆరమడకకు నియామకపత్రం అందించారు. జూన్ 17, 2024 నుంచి జూన్ 16, 2025 వరకు ఏడాది కాలంపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీ హబ్ నిర్మాణానికి ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కృషి చేస్తోందని రాష్ట్ర అధ్యక్షులు జే.ఎస్.రాజేంద్ర తెలిపారు. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు డాక్టర్.కరుణాకర్ ఆరమడక కృతజ్ఞతలు తెలిపారు.

'యూటీఎఫ్'ట్రెజరర్‌గా లక్ష్మిరాజా ఎన్నిక



కడప ఎడ్యుకేషన్: యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథక రాష్ట్ర ట్రెజరర్‌గా కడప జిల్లాకు చెందిన యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని నెల్లూరు పట్టణంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కుంటుబ సంక్షేమ పథకాన్ని రాష్ట్ర సంఘం ప్రవేశపెట్టింది. ఈ పథక రాష్ట్ర ట్రెజరర్‌గా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయులు మరణించినా, ప్రమాదాలలో తీవ్రంగా గాయపడినా.. అనారోగ్య పాలైన ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. కుటుంబ సంక్షేమ సంఘం ఉపాధ్యాయుల కుటుంబానికి భరోసాను కల్పించే విధంగా ఉంటుందన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు లక్ష్మిరాజా ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్





కడప బిల్టప్ ఈద్గాలో బక్రీద్ సందేశం ఇస్తున్న ముఫ్తీ మహమ్మద్ న్యామతుల్లా, ప్రార్థనల్లో పాల్గొన్న పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా హుసేనీ తదితరులు

- జిల్లా వ్యాప్తంగా ముస్లింల ఈద్ ప్రార్థనలు
- బిల్టప్ ఈద్గాలో ముస్లింల సామూహిక ప్రార్థనలు

కడప కల్చరల్: ప్రపంచ ముస్లిం లోకం అత్యంత పవిత్రంగా భావించే ఈద్ ఉల్ జుహా పండుగ (బక్రీద్)ను సోమవారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. పలువురు తమ సమీపంలోని మసీదుల్లో జరిగే ప్రార్థనల్లో పాల్గొనగా, అధికశాతం మంది ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, కమలాపురం తదితర ప్రాంతాల్లోని ఈద్గాలు ముస్లింలతో కళకళలాడాయి.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

పండుగ ప్రార్థనలకు వచ్చిన ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. కడప డీఎస్పీ షరీఫ్ పర్యవేక్షణలో పలువురు సీఐలు, ఎస్ఐలు కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టారు. ప్రార్థనల సందర్భంగా ట్రాఫిక్‌ను ముందే మళ్లించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగలేదు.

కడప బిల్టప్ ఈద్గాలో..

కడపలోని బిల్టప్ వద్దగల ఈద్గాలో నగరవాసులతోపాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు ముఫ్తీ మహమ్మద్ న్యామతుల్లా పండుగ సందేశమిస్తూ దేవుడు మానవుని త్యాగ గుణాన్ని పరిశీలించడమే ఈ పండుగ పరమార్థం అన్నారు. దైవంపై తమకు గల అచంచల భక్తిని ప్రదర్శించుకునే అవకాశం ఖుర్బానీ ద్వారా లభించడం వారి వారి అదృష్టమని తెలిపారు. దైవం భక్తులకు కఠినమైన పరీక్షలు పెడతారని, అందులో నెగ్గిన వారికి మంచి జీవితం ప్రసాదిస్తారని తెలిపారు. త్యాగానికి ప్రతీకగా ప్రవక్త హజరత్ ఇబ్రహీం అల్లాహ్ ఆదేశాన్ని పాటించిన సంఘటన గురించి వివరించారు. అలాగే మనుషుల్లో త్యాగ గుణం పెరగాలని, దైవం పేరిట త్యాగం చేయడంతోపాటు సాటి మనుషులతో పరస్పరం సహకరించుకుంటూ ఉన్నప్పుడే ప్రశాంత జీవనం, ప్రపంచ శాంతి సాధ్యమవుతాయన్నారు. త్యాగ గుణాన్ని దైవం ఎంతో అభిమానిస్తారని, త్యాగాలు చేసే వారిపై ఆయన తన కరుణను వర్షిస్తారన్నారు. ప్రస్తుత స్థితిలో ప్రపంచమంతా నెలకొన్న అశాంతిని, అలజడిని తొలగించడానికి త్యాగం ఒక్కటే శాశ్వత పరిష్కారమని దైవం బోధించారని తెలిపారు.అనంతరం పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా హుసేని సాహెబ్ భక్తులచే సామూహిక ప్రార్థనలు చేయించారు. భక్తులు ఒకరినొకరు హత్తుకుని 'ఈద్ ముబారక్ హో' అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దదర్గా ప్రతినిధులు, ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.



పులివెందుల: ఈద్గాలో నమాజ్‌కు సిద్ధమైన ముస్లింలు



ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ ఈద్గాలో ఈద్ సందేశం వింటున్న ముస్లింలు



బద్వేలులో ఈద్ నమాజు ఆచరిస్తున్న దృశ్యం

నేడు రైతు ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

- జిల్లావ్యాప్తంగా లక్షా 87 మంది రైతులకు లబ్ధి
- రూ. 37.32 కోట్లు రైతుల ఖాతాలకు జమ

కడప అగ్రికల్చర్: ఖరీప్ సీజన్‌లో పంటలు సాగు చేసే ముందు రైతులకు సాగు ఖర్చుల నిమిత్తం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద మొదటి విడతలో భాగంగా ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం రూ. 2 వేలు నగదును రైతు ఖాతాలకు అందచేస్తుంది. ఈ సొమ్మును 18వ తేదీ మంగళవారం ప్రధానమంత్రి మోదీ బటన్ నొక్కి నేరుగా రైతు ఖాతాకు జమచేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 36 మండలాల పరిధిలో లక్షా 87 మంది రైతులకు సంబంధించి రూ. 37.32 కోట్లు నగదు నేడు రైతుల ఖాతాలకు జమకానుంది.

కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత రైతుల ఖాతాలోకి రూ. 2 వేల రుపాయల నగదు జమ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమాన్ని నేడు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రసారం చేయడం జరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన దాదాపు 400 నుంచి 600 మంది రైతులు, కిసాన్ సఖిలు ప్రత్యక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వివిధ ప్రాంతాల రైతులతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా సంభాషణ, అనంతరం ఆయన మాట్లాడతారని తెలిపారు.



నలుగురు సీఐల బదిలీలు



కడప అర్బన్: జిల్లాలోని మైదుకూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీలు చేస్తూ కర్నూలు-కడప రేంజ్ డీఐజీ సీహెచ్ విజయారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
జి. శివశంకర్	వి.ఆర్. కడప	మైదుకూరు రూరల్ సర్కిల్
ఎం. శ్రీనాథ్‌రెడ్డి	మైదుకూరు రూరల్ సర్కిల్	వి.ఆర్. కడప
రామాంజనేయులు	వి.ఆర్. కర్నూలు రేంజ్	మైదుకూరు యు/జి పిఎస్
ఏ.పి మస్తాన్	మైదుకూరు యు/జి పిఎస్	వి.ఆర్. కడప

బ్యాగు..భద్రత ముఖ్యం

- మన్నిక లేకుంటే మూన్నాళ్ల ముచ్చటే
- షాపుల్లో కొనుగోలుదారుల సందడి

కడప ఎడ్యుకేషన్: స్కూలు బ్యాగు.. పుస్తకం నుంచి మొదలు పెన్ను, పెన్సిల్, టిఫిన్ బాక్సు ,వాటర్‌బాటిల్ తదితర వస్తువుల వరకు భద్రపరిచే బ్యాంక్. ఒకరకంగా చెప్పాలంటే పిల్లల ప్రపంచం. వారి ఆస్తి.అందుకే రోజంతా తమ భుజాలపై ఉండే బ్యాగు ఎంత భద్రంగా మన్నికగా ఉంటే విద్యార్థులు అంత సౌకర్యంగా ఉంటారు. లేని పక్షంలో అసహానికి గురవుతారు. అందుకే తల్లిదండ్రులు నాణ్యమైన బ్యాగులు కొనుగోలు చేయాలి.

- ఈనెల 13 వతేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం ..ఇలా ఎన్నో సమకూర్చాల్సి ఉంటుంది. ఇందుకు పెద్ద మొత్తంలోనే వెచ్చించాల్సి ఉంటుంది. అయితే ఫీజులు, పుస్తకాలు ఎంత ముఖ్యమో స్కూల్ బ్యాగు కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే కనీసం ఏడాది పాటు బ్యాగు అవసరం ఉంటుంది. సుమారు 5 కేజీల నుంచి 10 కేజీల బరువున్న పుస్తకాలను బ్యాగులో సర్ది పిల్లలు దీనికి భుజానికి ఎత్తుకుంటారు. రోజంతా పుస్తకాలు, బ్యాగుతో కుస్తీ పట్టే విద్యార్థులు అసహానికి గురవుతారు. అందుకే నాణ్యమైన బ్యాగులు కొనుగోలు చేయాలి. అప్పుడు విద్యార్థికి పాఠశాల రాకపోకల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. స్కూల్ బ్యాగుకు భద్రత, మన్నిక ముఖ్యం. బ్రాండెడ్ బ్యాగులు ఖరీదు రూ.600 నుంచి 1500 వరకు లభిస్తున్నాయి.



బ్యాగుల కొనుగోలు

సాగుకు వేళాయె



రుతుపవనాల రాకతో తొలకరి పలకరించింది. చినుకుల సవ్వడికి భూమాత పులకరించింది. ఫలితంగా పొలాలన్నీ పదునెక్కాయి. రైతులు కొత్త ఉత్సాహంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. కోటి ఆశలతో కాడి మేడి సిద్ధం చేసుకుని పొలంబాట పడుతున్నారు.

- వరుణుడి కరుణతో విత్తుకు మంచి అదును
- జూలై ఆఖరు వరకు ఖరీఫ్ సాగుకు అనువే
- 22 నుంచి ఏరువాక పౌర్ణమి
- 5754 మంది రైతులకు 3117.6 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ
- జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో 1369 హెక్టార్లలో సాగైన పంటలు
- అత్యధికంగా 1031 హెక్టార్లలో పత్తిపంట సాగు



సిద్దవటం ప్రాంతంలో వరిపంటను సాగు చేస్తున్న రైతన్నలు



వేముల ప్రాంతంలో సాగు చేసిన వేరుశనగ

కడప అగ్రికల్చర్: జిల్లాలో సాగు పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పచ్చిరొట్ట విత్తనాలతోపాటు వేరుశనగక్కాయలను అధికారులు సబ్సిడీతో పంపిణీ చేస్తున్నారు. ఇక విత్తుకు వేళ కావడంతో పల్లెల్లో ఎక్కడ చూసినా పనుల హడావుడి కనిపిస్తోంది. జూలై 15 వరకు విత్తుకు మంచి అదును అని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు 75,189 హెక్టార్లుకాగా 79,115 హెక్టార్ల సాగు లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు. జిల్లాలో ఖరీఫ్‌సీజన్ ప్రారంభమైన రెండు వారాల్లో 1369 హెక్టార్లలో వివిధ పంటలను సాగయ్యాయి. ఇందులో అధ్యధికంగా 1031 హెక్టార్లలో పత్తిపంట సాగైంది. ఈ సారి ఖరీఫ్ లక్ష్యానికి మించి సాగుకు అవకాశం కనిపిస్తోంది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు ఇబ్బంది పడకుండా....

రైతులు పంటల సాగుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీలుగా ప్రభుత్వం ముందుగానే పచ్చిరొట్ట విత్తనాలతో

విత్తనం	టార్గెట్ క్వింటాళ్లు	నిల్వ ఉన్నవి క్వింటాళ్లు	రిజిస్ట్రేషన్ అయినవి	తరలించిన విత్తనాలు
జీలుగలు	1800	1547.1	1677.7	747
జనుములు	3363	502	2557	104.8
పిల్లపెసలు	180	37.92	50.4	19.72
వేరుశనగ(కే6)	3530	2892	3078	1859.1
నారాయణి	1349	1347	1347	219.6
టిసిజిఎస్	400	181.8	284.4	219.6
కే-1812	570	99.6	159.6	37.2

పాటు వేరుశనక్కాయలను మంజూరు చేసింది. ఇందులో 5293 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మంజూరు చేసి 50 సబ్సిడీతో అందించింది. అలాగే వేరుశనగ విత్తనాలకు సంబంధించి 5849 క్వింటాళ్లు మంజూరు చేసి 40 శాతం సబ్సిడీ పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు మంజూరైన పచ్చిరొట్ట విత్తనాలతోపాటు వేరుశనక్కాయలకు సంబంధించి 11,192 క్వింటాళ్లకుగాను 6607.42 క్వింటాళ్లను రైతు భరోసా కేంద్రాలో సిద్ధంగా ఉండగా ఇందులో 9154.1 క్వింటాల్ విత్తనాల కోసం రైతన్నలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటి వరకు 5754 మంది రైతులు 3117.06 క్వింటాళ్ల విత్తనాలను తీసుకెళ్లారు.

జిల్లాలో 79,115 హెక్టార్లు సాగు లక్ష్యంగా...

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ -2024కు సంబంధించి సాధారణ సాగు 75,189 హెక్టార్లుకాగా 79115 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు లక్ష్యంగా నిర్ధారించారు. ఇందులో కేసీ కెనాల్‌తోపాటు నీటి ఆధారంగా ఈ ఏడాది వరి సాధారణ సాగు 31,171 హెక్టార్లుగా ఈ ఖరీఫ్‌లో 32,000 హెక్టార్లను సాగు లక్ష్యంగా నిర్ధారించారు. అలాగే పత్తి సాధారణ సాగు 24,086 హెక్టార్లుకాగా 25 వేల హెక్టార్లను, వేరుశనగ సాధారణ సాగు 5971 హెక్టార్లకు గాను 6 వేల హెక్టార్లలో, కంది సాధారణసాగు 3894 హెక్టార్లు కాగా 4500 హెక్టార్లలో, సన్‌ఫ్లవర్ 1126 హెక్టార్లకుగాను 1500 హెక్టార్లలో, మినుము 2642 హెక్టార్లకుగాను 3 వేల హెక్టార్లలో, జొన్న పంట 1407 హెక్టార్లకుగాను 15 వందల హెక్టార్లలో, సజ్జ పంట 1039 హెక్టార్లకుగాను 1050 హెక్టార్లో, సోయాబీన్ 963 హెక్టార్లకుగాను 1000 హెక్టార్లలో , ఆముదం 821 హెక్టార్లకుగాను 1000 హెక్టార్లలో, మొక్కజొన్న సాదారణసాగు 637 హెక్టార్లకుగాను 1000 హెక్టార్లతోపాటు పలు పంటలను సాగు చేయనున్నారు.

1369 హెక్టార్లలో వివిధ పంటలు సాగు...

జిల్లాలో ఖరీఫ్ -2024 సీజన్‌కు సంబంధించి సాదారణ విస్తీర్ణం 79,115 హెకార్లగాకు గాను ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన రెండు వారాల్లోనే జిల్లాలో 1369 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారు. ఇందులో 28 హెక్టార్లలో వరి, 5 హెక్టార్‌లలో సజ్జ, 16 హెక్టార్‌లలో మొక్కజొన్న, 130 హెక్టార్లలో మినుము, 146 హెక్టార్లలో వేరుశనగ, రెండు హెక్టార్లలో సన్‌ఫ్లవర్, 1031 హెక్టార్లలో పత్తి, 11 హెక్టార్లలో చెరకు పంటలు సాగైయాయి. ఇందులో అత్యధికంగా పత్తి 1031 హెక్టార్లలో సాగయింది. గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది వరిపంట మినహా మిగతా ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం బాగా పెరిగింది.

విత్తుకు వేళయింది..

ఖరీఫ్ పంటలసాగుకు వేళయింది. పచ్చిరొట్ట విత్తనాలతోపాటు వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, కంది, సజ్జ తదితర పంటల విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జులై 15 వరకు మంచి అదునని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కొంచం ఆలస్యమైనా పంటల పరిస్థితిని బట్టి జులై నెలాఖరు వరకు కూడా పంటలు వేసుకునే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ నెల 22న ఏరువాక పౌర్ణమితో పాటు అరుద్రకార్తె కూడా ప్రవేశిస్తుండంతో సాగుకు సరైన సమయం అని రైతన్నలు కూడా అంటున్నారు. విత్తనాలను విత్తుకునేందుకు ఆరుద్రకార్తెతోపాటు ఆ తర్వాత వచ్చే పునర్వసు కార్తె కూడా కీలకమైనవేనని వారు తెలిపారు.

అందుబాటులో విత్తనాలు



ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. జిల్లాలో వరి, పత్తి, వేరుశనగ పంటలు అధిక విస్తీర్ణంలో సాగుకానున్నాయి. వీటిలో భాగంగా వరి పంటకు ముందుగా సాగు చేసుకునేందుకు పచ్చి రొట్ట విత్తనాలు ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్నాయి. అలాగే వేరుశనక్కాయలు కూడా సిద్ధంగా ఉన్నాయి. కావాల్సిన రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి తెచ్చుకోవాలి. – అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సాగర్

పోరుమామిళ్ల : మండలంలోని అక్కలరెడ్డిపల్లెకు చెందిన దాసరిపల్లె సాగర్ (22) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామ సమీపంలోని టెలిఫోన్ టవర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. తనకు ఉద్యోగం రాలేదని, ఒంటరిగా ఉంటూ ఆలోచన చేస్తుండేవాడని.. ఆ కారణంగానే ఉరి వేసుకున్నట్లు మృతుని తండ్రి గురయ్య తెలిపాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించామన్నాని పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని..


మృతిచెందిన సువర్ణ

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామానికి చెందిన భజంత్రీ సువర్ణ (30) అనే మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ పి.తులసి నాగప్రసాద్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో సువర్ణ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతురాలుకు భర్త భజంత్రీ రఘుతో పాటు కుమారుడు ఉన్నాడు. మృతురాలు తండ్రి మంగలి సుబ్బరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించాడు.

జూదరులు అరెస్టు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని నిడుజివ్వి, పోట్లదుర్తి గ్రామాలలో పేకాటాడుతున్న 24 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.97,710 నగదు స్వాధీనం చేసుకున్నట్లు యర్రగుంట్ల ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. నిడుజివ్వి గ్రామంలో ఓ ఇంటిలో పేకాటాడుతున్న 16 మంది జూదరులను అరెస్టు చేసి రూ.72,750 నగదును, అలాగే పోట్లదుర్తి గ్రామం సమీపంలో గంగమ్మతల్లి దేవాలయం సమీపంలోని కంపచెట్లలో 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.24,960 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లాలో 'పెన్నమ్మ' గలగలలు

పరవళ్లు తొక్కుతున్న ప్రవాహం


పెన్నానదిలో నీటి ప్రవాహం

కడప కల్చరల్ : అసలే వర్షాకాలం.. వారం, పదిరోజులకుపైగా అడపా దడపా కురుస్తున్న వర్షం .. జిల్లాకు పెట్టని ఆభరణంలా పెన్నానది. ఒంపు సొంపులతో వయ్యారంగా పరవళ్లు తొక్కుతున్న నీటి గలగలలు. రాతి కొండలను చీలుస్తూ, పంట పొలాలను తడుపుతూ వంకలు, వాగులు, ఏర్లు, సెలయేర్లను తనలో కలుపుకుంటూ వడివడిగా సవ్వడి చేస్తూ సాగిపోతోంది పెన్నమ్మ.

ఇటీవల కురుస్తున్న వర్షాలకు పొడిబారి ఉన్న పెన్నానదిలో నీరు పరవళ్లు తొక్కుతోంది. పిల్లలు, పెద్దలు చెన్నూరు, సిద్దవటం, ప్రొద్దుటూరు, గండికోట ఇంకా పెన్నా ప్రవాహం గల ప్రాంతాలకు వెళ్లి పెన్నమ్మ ప్రవాహాన్ని కనువిందుగా తిలకిస్తున్నారు. రైతులు ఆనంద పరవశులవుతున్నారు. మరో సంవత్సరానికి కూడా అవసరాలు తీర్చగల స్థాయిలో పెన్నమ్మ జిల్లా దాహం తీరుస్తుందని ఆశిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాలను తడుపుతున్న పెన్నానది గురించిన వివరాలు.

'సీమ' జిల్లాలకు పెన్నానది జవ జీవాలను అందిస్తోంది. ముఖ్యంగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, చెన్నూరు, సిద్దవటం ప్రాంతాలలో ఈ నది ప్రవాహాన్ని చూసేందుకు ప్రజలు తరలి వస్తున్నారు. పెన్నానది కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నందిదుర్గకు వాయువ్య దిశలోని కొండల్లో పుట్టింది. పొరుగు జిల్లా అనంతపురంలోని తాడిపత్రికి దిగువ భాగం నుంచి మన జిల్లాలోని కొండాపురం మండలం కోడూరు వద్ద ఈ ప్రాంతంలోకి అడుగు పెడుతోంది. అక్కడి నుంచి దక్షిణ దిశలో చిత్రావతిని కలుసుకుని జమ్మలమడుగు వద్ద గండికోట కఠిన రాతి గుట్టలకు గండికొట్టి వాటిని చీల్చుకుంటూ ఎనిమిది కిలోమీటర్లు సాగి మైలవరం ఆనకట్ట వద్ద సేద తీరుతోంది. అక్కడి నుంచి జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు ప్రాంతాల ద్వారా కడప నగరం మీదుగా నెల్లూరు జిల్లాకు వెళుతుంది. కడప నగరంలో కూడా పెన్నా ప్రవాహం సాగుతోంది. నగర సమీపంలోని వాటర్ గండి ప్రాంతం నుంచి నది ప్రవహిస్తోంది. ఈ నది కారణంగానే ఆ ప్రాంతాన్ని వాటర్ గండిగా వ్యవహరిస్తున్నారు. నీరున్న సమయంలో నగర వాసులు ఆ ప్రాంతాలను చూసేందుకు విశేష సంఖ్యలో వెళుతుంటారు. దీంతో ఇది విహార ప్రాంతంగా ఆహ్లాదాన్ని పంచుతోంది. ఈ ప్రాంతంలోని నది నుంచే కడప వాసులకు తాగునీరు అందుతోంది. వాటర్ గండి నుంచి సిద్దవటం మీదుగా ఈ నది సోమశిల ప్రాజెక్టు వద్ద నుంచి చివరి మజిలీకి చేరి అక్కడి బంగాళాఖాతంలో కలుస్తోంది.

చిన్న నదులతో పెన్నమ్మ

పెన్నానదికి దక్షిణం నుంచి చిత్రావతి, పాపాఘ్ని, చెయ్యేరు, ఉత్తరం నుంచి కుందూ, సగిలేరు లాంటి ఉపనదులు కలుస్తున్నాయి. దక్షిణం నుంచి చిన్న నదులైన పాగేరు, బుగ్గవంక, కాలేటి వాగు కలుస్తున్నాయి. పాపాఘ్నికి మొగమూరు యేరు, కుందూకు వక్కిలేరు, పింఛా, మాండవ్య, గుంజన, సగిలేరుకు లేదుకుపాడు, బుక్కినేరు, మడేరు నదులు ఉప నదులుగా ఉన్నాయి. పెన్నాకు చెయ్యేరు ఉపనదికాగా, చెయ్యేరుకు గుంజన ఉపనదిగా ఉంటోంది. దీని ఉప నదులు, వాటి ఉపనదులపై ఎగువ సగిలేరు ఆనకట్ట, రాజోలు ఆనకట్ట, వెలిగల్లు, పింఛా ఆనకట్టలను నిర్మించారు. పెన్నా ప్రత్యక్షంగా, పరోక్షంగా జిల్లాలోని యల్లంరాజు చెరువు, కమలాపురం, బద్వేలు, పోరుమామిళ్ల చెరువులు, మంచాలమ్మ చెరువుతోపాటు చాపాడు, మైదుకూరులకు కూడా నీటిని అందిస్తోంది.

'పద్మవ్యూహంలో చక్రధారి' సినిమాను ఆదరించాలి


విలేకరుల సమావేశంలో పాల్గొన్న పద్మవ్యూహంలో చక్రధర్ సినిమా యూనిట్

కడప రూరల్ : ఈ నెల 21వ తేదీన విడుదల అవుతున్న పద్మవ్యూహంలో చక్రధారి చిత్రంను విజయవంతం చేయాలని ఆ చిత్రం యూనిట్ తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ చిత్రం దర్శకుడు సంజయ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమాను రాయలసీమ నేపథ్యంలో కుటుంబ ప్రేమ కథా చిత్రంగా నిర్మించామన్నారు. ఈ సినిమాను దాదాపుగా 35 రోజుల పాటు పులివెందుల ప్రాంతంలో తీశామన్నారు. రాయలసీమ అంటే కుట్రలు, కుతంత్రాలు, ఫ్యాక్షన్ నేపథ్యంలోనే సినిమాలు వస్తుంటాయన్నారు. అందుకు భిన్నంగా తాము మంచి కుటుంబ ప్రేమ కథతో సినిమాను నిర్మించామన్నారు. ఈ చిత్రానికి నిర్మాతగా కేసీ రామరాజు వ్యవహరించారని తెలిపారు. హీరో ప్రవీణ్‌రాజ్ మాట్లాడుతూ తాను రాయచోటిలో పుట్టి పెరిగానని తెలిపారు. కడప ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. సినీ రంగంపై మక్కువతో మంచి చిత్రంలో హీరోగా నటించినందుకు సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ శశికా మాట్లాడుతూ సినిమాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రచయిత శివ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. వెంకటసుబ్బయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. వెంకటసుబ్బయ్య, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి. సుభాషిణి, ఎల్. శాంతి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం ఇస్తానని చేసిన వాగ్దానం ప్రకారం తక్షణం కనీస వేతనం ఇచ్చి జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాణ స్వీకారం చేసి వారం రోజులు కాక మునుపే రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ మండల ఇన్‌చార్జిలు వేధింపులకు గురి చేస్తున్నారని, ఉద్యోగాలు తీసివేస్తున్నామని బెదిరింపులకు దిగడం తగదన్నారు. రాష్ట్రంలో 24 గంటలు అందుబాటులో ఉంటూ గర్భవతులకు, బాలింతలకు, ప్రజలకు సేవ చేస్తున్న ఆశా కార్యకర్తలకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు. మరియమ్మ, కె. కల్పన పాల్గొన్నారు.

ఎయిడెడ్ పోస్టుల అక్రమాలపై విచారణ చేపట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాలలలో గత 25 సంవత్సరాలుగా తక్కువ జీతాలతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఇవ్వకుండా బిషప్ గాలి బాలిరెడ్డి అన్యాయం చేస్తున్నారని, బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. ఎం.ఓబులేసు, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపాక వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని కడప మరియాపురం చర్చి దగ్గర నుండి బిషప్ హౌస్ వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎయిడెడ్ పాఠశాలలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వచ్చిందన్నారు ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో కడప డయాసిస్ ఆర్‌సీఎంలో దాదాపు గత 20 సంవత్సరాల తరువాత ఎయిడెడ్ ఉద్యోగాల భర్తీకి గవర్నమెంట్ నుండి మొత్తం 29 ఉద్యోగాలకు అనుమతి వచ్చిందన్నారు. అయితే ఎన్నో ఏళ్లుగా తక్కువ వేతనంతో ఇక్కడ పనిచేసిన వారిని కాదని, ఆర్‌సీఎం సంస్థలలో పనిచేయని రోస్టర్ పాయింట్స్‌లో లేని కొత్త వ్యక్తులకు అవకాశం ఇస్తున్నారని ఆరోపించారు. ఒక్కొక్క పోస్ట్ కు రూ.30 లక్షల నుండి రూ.45 లక్షల వరకు ఉద్యోగాలను అమ్ముతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాధిత ఉపాధ్యాయులు కవిత, ప్రమీలా రాణి, వెంకటసుబ్బయ్య, శేఖర్, ప్రమీల, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకుని వస్తుండగా..

- కారును ఢీకొన్న ఆర్టీసీ అద్దె బస్సు
- ఇద్దరు దుర్మరణం
- భార్యాభర్తలకు తీవ్రగాయాలు


సంఘటన స్థలంలో ఆర్టీసీ అద్దెబస్సు


సంఘటన స్థలంలో నుజ్జు నుజ్జయిన కారు


కారులో ఇరుక్కున్న మృతదేహాలు


తీవ్రంగా గాయపడిన రాజమోహన్ భార్య లక్ష్మీదేవి

కడప అర్బన్ : ఇంటి నుంచి ఉదయాన్నే బయలుదేరారు.. పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గుర్రప్ప స్వామి వద్ద మొక్కు తీర్చుకున్నారు... తిరిగి కడపకు బయలుదేరారు. కడప నగర శివార్లలోకి తాము వెళ్లిన కారులోనే వచ్చారు. సరిగ్గా పదే పది నిమిషాల్లో గమ్యస్థానమైన ఇంటికి చేరుకుంటారు. ఇంతలోపే ఎదురుగా మృత్యుశకటం రూపంలో ఆర్టీసి అద్దె బస్సు వచ్చి ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. భార్యాభర్తలైన మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. ఈ సంఘటనపై పోలీసుల, మృతుల బంధువులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా వున్నాయి.

కడప నగరంలోని భాగ్యనగర్‌కాలనీలో నివాసం వుంటూ మేస్త్రీ పనిచేస్తున్న దూదిశెట్టి రామయ్య (55) ఇటీవల ఎటియోస్ కారు తెచ్చుకున్నాడు. కడప నగరంలోని ఉక్కాయపల్లెకు చెందిన దాదిబోయిన రాజమోహన్(55) రామయ్యకు స్నేహితుడు. ఈక్రమంలో రాజమోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి, రామయ్య వద్ద వున్న కారులో వెళ్లి పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను వద్ద వున్న గుర్రప్ప స్వామి వద్ద మొక్కుబడి తీర్చుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో రాజమోహన్, అతని భార్య లక్ష్మీదేవి (47), వీరి కుమారుడు దాదిబోయిన సాయి గురురోహిత్ (25)తో కలిసి రామయ్య వద్దకు వెళ్లారు. రామయ్య తన కారులో సోమవారం ఉదయాన్నే కడప నుంచి పోరుమామిళ్లకు వారి కుటుంబంను తీసుకుని వెళ్లారు. పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గుర్రప్ప దగ్గరికి చేరుకున్నారు. అక్కడ తలనీలాలు సమర్పించి, పూజలు నిర్వహించి తిరిగి కడపకు చేరుకునేందుకు బద్వేల్‌కు వచ్చారు. మార్గమధ్యంలో బద్వేల్‌లో వున్న లక్ష్మీదేవి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి కడపకు బయలుదేరారు. కడప నగర శివార్లలో గురుకుల పాఠశాల సమీపంలోకి వచ్చే సరికి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసి అద్దె బస్సు వేగంగా వచ్చి వీరి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామయ్య, సాయిగురు రోహిత్ అనే ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. భార్యాభర్తలు రాజమోహన్, లక్ష్మీదేవిలు ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. వీరిని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కడప రిమ్స్ పిఎస్ పోలీసులు పరిశీలించారు. కారులో ఇరుక్కున్న రెండు మృతదేహాలను రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దూదిశెట్టి రామయ్య (ఫైల్)


సాయి గురు రోహిత్ (ఫైల్)


సాయి గురు రోహిత్ మృతదేహం

కుటుంబ పెద్దను కోల్పోయామనీ..

కడప నగరంలోని భాగ్యనగర్ కాలనీలో నివాసం వుంటున్న దూదిశెట్టి రామయ్య మేస్త్రీ పనిచేస్తూ... అందరితో కలివిడిగా వుండేవాడనీ అతన్ని స్నేహితులు మేస్త్రీ వెంకటేశు, బాలరాజులు ఆవేదన వ్యక్తం చేశారు.

రిమ్స్ క్యాజువాలిటీ వద్ద ఉన్న తమ తండ్రి రామయ్య మృతదేహాన్ని చూసి కుమారులు శ్రీహరి, మహీంద్రారాయల్ తమ కుటుంబపెద్దను కోల్పోయామని బోరున విలపించారు.

భర్తపై దాడి చేసిన భార్య


భార్య చేతిలో దాడికి గురై తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

మదనపల్లె : ప్రతిరోజు వేధిస్తున్న భర్తపై భార్య దాడి చేసిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. తిరుపతి జిల్లా ఎర్రావారి పాలెం మండలం కోటకాడపల్లి కు చెందిన వెంకటరమణ తన భార్య జ్యోతితో కలిసి 12 సంవత్సరాల క్రితం కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి ఉపాధి కోసం వచ్చి స్థిరపడ్డాడు. ఇద్దరు భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. కుమారుడు నరసింహులు సైతం భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వెంకటరమణ గత కొంతకాలంగా మద్యానికి బానిసై, ప్రతిరోజు మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యతో అకారణంగా గొడవకు దిగి, ఆమె మెడలోని తాళిబొట్టుతో గొంతు బిగించి చంపేస్తానంటూ దాడికి దిగాడు. దీంతో ఆవేశానికి లోనైన భార్య జ్యోతి సమీపంలో ఉన్న కొడవలి తీసుకుని భర్తపై దాడి చేసింది. దాడిలో వెంకటరమణ తలకు తీవ్ర గాయం కాగా, వెంటనే 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

వివాహిత అదృశ్యం

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. గుర్రంకొండ మండలం చెర్లోపల్లెకు చెందిన షేక్ ఇమ్రాన్, అతడి భార్య షేక్ తబస్సుమ్ సుల్తానా(19) ఇద్దరూ కలిసి ఈనెల 16న వైద్యపరీక్షల కోసం మదనపల్లెలో ఆస్పత్రికి వచ్చారు. భర్త ఇమ్రాన్ వైద్యపరీక్షల రిపోర్ట్ తెచ్చేందుకు వెళ్లి తిరిగి ఆస్పత్రికి రాగా, అతడి భార్య కనిపించలేదు. దీంతో పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాధితుడు ఇమ్రాన్ తన భార్య అదృశ్యంపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నల్ల నువ్వుల లడ్డు.. పోషకాలు మెండు

- ఎముకల ధృడత్వానికి ఎంతో మేలు
- రుచికి ఫిదా అంటున్న పట్టణ ప్రజలు


నల్ల నువ్వుల లడ్డులు


సద్దరొట్టెలు


తోపుడు బండిలో నువ్వుల లడ్డులు విక్రయిస్తున్న షర్ఫుద్దీన్

మదనపల్లె : ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి. నేటి ఆధునిక ప్రపంచంలో ఆరోగ్యకరమైన ఆహారం దొరకడం కష్టమవుతోంది. ఎక్కడ చూసినా ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్, హానికరమైన పదార్థాలతో ఆహారం తయారీ జరుగుతుండటంతో శక్తి రాకపోగా, క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణిస్తోంది. ఇప్పుడిప్పుడే ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం, జీవనశైలిలో మార్పుల కోసం ప్రయత్నించడం ప్రారంభమైంది. ఇప్పుడు ఆరోగ్య అభిలాషులను ఎవ్వరిని కదిపినా దంపుడు బియ్యం, బ్రౌన్ బియ్యం, మిల్లెట్స్ అంటూ సంప్రదాయక ఆహారాల గురించే మాట్లాడుతున్నారు. వీటిని తినేందుకు ఇష్టపడుతున్నారు.

ప్రజలకు సంప్రదాయక ఆహార పదార్థాలపై పెరుగుతున్న ఇష్టాన్ని ఓ వ్యక్తి తన జీవనోపాధిగా ఎంచుకున్నాడు. తోపుడుబండిలో పోషకాలతో కూడిన నల్ల నువ్వుల లడ్డు, సద్దరొట్టెలు, మిల్లెట్స్ లడ్డులు విక్రయిస్తూ, ప్రజలకు ఆరోగ్యంతో పాటు తాను ఆదాయం పొందుతున్నాడు.

శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన షర్ఫుద్దీన్ ఏడాది క్రితం జీవనోపాధి కోసం మదనపల్లెకు చేరుకున్నాడు. తన వద్ద ఉన్న కొద్దిపాటి మొత్తంతో చేయదగిన వ్యాపారం గురించి అన్వేషించాడు. ఏం చేద్దామన్నా పెట్టుబడులు అధికంగా ఉండటం, పోటీ ఉండటం, జరుగుతుందో లేదో అన్న భయం ఉండటంతో....తనకంటూ ప్రత్యేకత ఉంటే తప్పక నిలుదొక్కుకోగలమని నల్ల నువ్వుల ఉండల తయారీ, అమ్మకం ప్రారంభించాడు. స్వచ్ఛమైన నల్లనువ్వులను తీసుకువచ్చి, వాటిని బాగా శుభ్రపరిచి, మెత్తగా దంచి, వాటికి వేరుశెనగ విత్తనాల పొడి, బెల్లంను కలిపి రుచికరమైన ఉండలు తయారుచేశాడు. ఒకటే ఆహారం అమ్మితే జనాలు ఆసక్తి చూపరని, వాటికి అదనంగా సద్దరొట్టెలు, జొన్న, సజ్జలు, బెల్లం కలిపిన మిల్లెట్స్ లడ్డులు తయారుచేసి తోపుడు బండిలో వేసుకుని మదనపల్లె వీధుల్లో అమ్మడం ప్రారంభించాడు.

నల్లనువ్వుల లడ్డులు అయితే రూ.50కి 2, సద్దరొట్టె(పప్పుల పొడితో) ఒకటి రూ.20, సజ్జ,జొన్న, మిల్లెట్స్ లడ్డు అయితే... రూ.50కి 4 చొప్పున విక్రయిస్తున్నాడు. మొదట్లో వీటిపై అంత ఆసక్తి చూపని పట్టణ ప్రజలు, మెల్లమెల్లగా వీటి పోషకవిలువల గురించి తెలిసిన తర్వాత షర్ఫుద్దీన్ నువ్వుల ఉండల కోసం ఎదురుచూసి మరీ కొంటున్నారు. ఆహా, ఓహో అంటూ ఆనందంగా తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

ఆరోగ్యం.. ఆదాయం..

నల్ల నువ్వుల లడ్డుతో ప్రజలకు ఆరోగ్యం, నాకు ఆదాయం. ఉదయం 6 గంటల నుంచి వీటి తయారీ మొదలుపెడతాను. దాదాపు నాలుగు గంటలు శ్రమిస్తే 10 గంటలకు రుచికరమైన నువ్వుల లడ్డులు తయారవుతాయి. పట్టణంలో అందరికీ వీటి రుచి చూపించాలని ఒకో రోజు ఒకో ప్రాంతానికి వెళ్లి వ్యాపారం చేస్తుంటాను. రోజుకు అన్నిఖర్చులు పోనూ రూ.1,200 ఆదాయం పొందుతున్నాను.

– షర్ఫుద్దీన్, శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి

నువ్వుల లడ్డుతో ఆరోగ్యం..



పిల్లలు ఎదిగే క్రమంలో వారికి సరైన పోషకాహారం అందించడం చాలా అవసరం. అలా అందించినప్పుడే వారు శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతారు. నువ్వుల్లో కాల్షియం, ఐరన్ అధికంగా ఉన్నందున ఎముకలు ధృడంగా తయారవుతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు తినడం వల్ల మెగ్నీషియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి.

– జీ.వి.ప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, మదనపల్లె